సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం • 24 • అక్టోబర్ • 2024




3 నుంచి 'పంచారామ దర్శిని'

పవిత్ర కార్తీకమాసంలో ఒకే రోజున పంచారామాలను దర్శనం చేసేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. 8లో



ఎరుపెక్కిన ఆకాశం

విశాఖ: హెల్త్‌సిటీ ప్రాంతంలో ఆకాశం బుధవారం సాయంత్రం ఎర్రగా మారి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది.



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి బుధవారం ఉదయం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

డోలీలో గర్భిణి తరలింపు

- రహదారి సౌకర్యం లేక కర్రిగుడ గ్రామస్తుల అవస్థలు



డోలీలో గర్భిణిని తరలిస్తున్న గిరిజనులు

అనంతగిరి (అరకులోయ రూరల్): పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తరలించారు. అనంతగిరి మండలం గుమ్మ పంచాయతీ కర్రిగుడకు చెందిన గర్భిణి కొర్రా రాధ(25)కు బుధవారం పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. గ్రామానికి రహదారి సౌకర్యం లేనందున బంధువులు, గ్రామస్తులు ఆమెను డోలీలో నిమ్మ ఊట గ్రామం వరకు మోసుకుని వచ్చారు. అక్కడి నుంచి ఆటోలో ఆస్పత్రికి తరలించారు. గతంలో కర్రిగుడ మార్గంలో జరుగుతున్న రహదారి పనులు అటవీశాఖ అధికారులు అభ్యంతరం వల్ల నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జనావాసాల్లోకి చుక్కల జింక

- స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు
- కుక్కల దాడిలో గాయపడటంతో చికిత్సకు తరలింపు



గంగాలమ్మ ఆలయంలో చుక్కల జింక

మారేడుమిల్లి : అడవి నుంచి తప్పిపోయి ఓ చుక్కల జింక జనావాసాల్లోకి వచ్చింది. స్థానిక గంగాలమ్మ వీధి సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చుక్కల జింకను కుక్కలు వెంబడించి గాయపరిచాయి. దీంతో వాటి నుంచి తప్పించుకుని గంగాలమ్మ ఆలయంలో వెళ్లింది. దీనిని గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడికి వెళ్లి చుక్కల జింకను స్వాధీనం చేసుకున్నారు. చికిత్స అందించిన అనంతరం అటవీప్రాంతంలో విడిచిపెడతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఆస్ట్రేలియా టూర్‌కు రికీ, నితీష్

- భారత్ 'ఏ' జట్టుకు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: విశాఖ కుర్రాళ్లు రికీబుయ్, నితీష్‌కుమార్ రెడ్డి భారత్ ఏ జట్టుకు ఎంపికయ్యారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆతిథ్య ఆస్ట్రేలియాతో భారత్ జట్టు ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. నవంబర్ 22 నుంచి జనవరి 8వ తేదీ మ్యాచ్‌లు జరగనున్నాయి. టూర్‌లో భాగంగా ఆస్ట్రేలియా ఏ జట్టుతో భారత్ ఏ జట్టు రెండు అనధికార నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్‌లను ఆడనుంది. ఈ రెండు మ్యాచ్‌లకు ఆంధ్రా కెప్టెన్ రికీబుయ్, ఆల్‌రౌండర్ నితీష్‌కుమార్‌రెడ్డి అవకాశం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఏసీఏ కార్యదర్శి సతీష్‌బాబు వీరిద్దరిని అభినందించారు. భారత్ ఏ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వం వహించనున్నాడు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం నేడు

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించి.. తర్వాత శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తారు. ఈ సమావేశానికి అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని ఆయన సూచించారు.



గాలిలో తేలిపోదాం..

- హాట్ ఎయిర్ బెలూన్ ఫ్లైకు ట్రైల్ రన్ పూర్తి

ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో హాట్ ఎయిర్ బెలూన్ ఫ్లై అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అరకు పద్మాపురం గార్డెన్‌లో విజయదశమి నాడు ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రారంభించిన ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు అవుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం నుంచి పూర్తి అనుమతికోసం నిర్వాహకులు ఎదురు చూస్తున్నారు. పర్యాటకులు గాలిలో విహరించి అరకులోయ పరిసర అందాలను వీక్షించే వీలు కలుగుతుంది. మంగళవారం వరకు ట్రయల్ రన్ నిర్వహించామని, ఒకొక్క వీక్షకుడు పది నిమిషాలు విహరించేందుకు నుంచి రూ.1500 వసూలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

హాట్ ఎయిర్ బెలూన్ ఫ్లై అందుబాటులోకి వస్తే 200 మీటర్ల ఎత్తులో విహరిస్తూ ప్రత్యేక అనుభూతి పొందవచ్చు. ఇక్కడికి సమీపంలోని జైపూర్ జంక్షన్ ప్రాంతంలో కూడా త్వరలో పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో పారా మోటరింగ్ కూడా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక్కడ కూడా పీవో అభిషేక్ ట్రయల్ రన్ నిర్వహించారు.

– అరకులోయ టౌన్



మేఘాల్లో విహరిద్దాం..

- లంతంపాడు, దిబ్బవలస ప్రాంతాల్లో అందాలు కనువిందు

ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన అరకులోయ ప్రాంతంలో మరో మేఘాల కొండ వెలుగులోకి వచ్చింది. మండలంలో సిర్గం పంచాయతీ పరిధిలో లంతంపాడు, దిబ్బవలస గ్రామాల సమీపంలో ఎత్తయిన అటవీ ప్రాంతంలో మంచు అందాలు పాల సముద్రాన్ని తలపిస్తున్నాయి. వంజంగి హిల్స్‌లో మాదిరిగానే ఇక్కడ కూడా కనువిందు చేస్తున్నాయి. ఇక్కడికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఉండటంతోఈ అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.

– అరకులోయ రూరల్

సిరి.. వరించేలా..

వరి సాగు చేపట్టిన గిరి రైతులకు కాలం కలిసొచ్చింది. కంకులతో పైరు కళకళలాడుతోంది. దిగుబడికి సిద్ధమవడంతో మరో పది రోజుల్లో పంట కోతకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



- ఆశాజనకగా వరి సాగు
- పొట్ట, గింజ దశలో వరి పైరు
- అనుకూలించిన వాతావరణం
- పంట కోతకు సిద్ధపడుతున్న రైతులు



విరగ్గాసిన వరి కంకులు

సన్యాసమ్మపాలెం ప్రాంతంలో కంకులతో కళకళలాడుతున్న వరి పైరు

సాక్షి, పాడేరు: ఖరీఫ్‌లో సాగు చేపట్టిన వరి పైరు కంకులతో కళకళలాడుతోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం వల్ల దిగుబడులు ఆశాజనకంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలో చింతూరు డివిజన్ మినహా మిగిలిన 18 మండలాల్లో వరి నాట్లు సకాలంలో వేశారు. జిల్లావ్యాప్తంగా 56 వేల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేపట్టారు. 80 శాతం పైరు పొట్టదశలో, 20శాతం గింజ దశలో ఉంది.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుగానే ఖరీఫ్ సాగు ప్రణాళికను జనవరిలో సిద్ధం చేసింది. 90 శాతం రాయితీపై 21వేల క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేసింది. ఆ మేరకు వ్యవసాయశాఖ పంపిణీ చేసింది.
- గిరిజన ప్రాంతానికి అనుకూలమైన 1021 శ్రీధృతి రకం వరివిత్తనాలను పొందిన గిరిజన రైతులు సకాలంలోనే వరినారుమడులు తయారు చేసుకుని నాట్లు వేశారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు చింతూరు డివిజన్‌తో పాటు గూడెంకొత్తవీధి, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల మండలాల్లో 2774.46 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లింది.

పది రోజుల్లో పంట కోత

మరో పది రోజుల్లో వరి పైరు కోతలకు సిద్ధమవుతుంది. ఈఏడాది నెలరోజులు ముందుగానే పంట దిగుబడి వచ్చే పరిస్థితి ఉంది. ఈ క్రాప్ నమోదు కూడా 80 శాతం పూర్తయింది. పంట కోతల ప్రయోగానికి వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

జీలకర్ర సన్నాలు సాగు చేపట్టా



ఎకరా విస్తీర్ణంలో జీలకర్ర సన్నాలు రకం వరిసాగు చేపట్టా. సకాలంలో నాట్లు వేశాం. వర్షాలు అనుకూలించాయి. పంట ఎదుగుదల బాగుంది. దిగుబడి బాగానే వచ్చే అవకాశం ఉంది. వచ్చే వారం పంటకోతకు ఏర్పాట్లు చేసుకుంటున్నా.

– పాంగి మత్స్యరాజు, గిరిజన రైతు, సన్యాసమ్మపాలెం

ముందుగా విత్తన పంపిణీతో మేలు

జిల్లా వ్యాప్తంగా 90శాతం రాయితీపై ముందుగానే విత్తనాలు పంపిణీ చేయడంతో రైతులకు మేలు జరిగింది. ఈ ఏడాది కూడా పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. అన్ని ప్రాంతాల్లో వరి పైరు పొట్ట దశలో కళకళలాడుతోంది.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

అటవీశాఖ వనాలు నరికివేత

- గుర్తించిన రేంజ్ అధికారి శ్రీనివాసరావు
- బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడి



నీలగిరి, అకేషియా కలపను పరిశీలిస్తున్న రేంజ్ అధికారి శ్రీనివాసరావు



తరలింపునకు సిద్ధం చేసిన సిల్వర్‌ఓక్ కలప వద్ద రేంజ్ అధికారి శ్రీనివాసరావు

డుంబ్రిగుడ: అటవీశాఖకు చెందిన సిల్వర్‌ఓక్, నీలగిరి, అకేషియా వనాలు నరికివేతకు గురవుతున్నాయి. మండలంలోని సొవ్వా పంచాయతీ సొవ్వ, కాగువలస, మాలివలస, పనసవలస, ఒడియా వలస, గొప్పులవలస ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరావు గుర్తించారు. నీలగిరి, అకేషియా చెట్లను నరికి తరలించేందుకు అక్రమార్కులు సిద్ధం చేశారు. వీటిని గుర్తించిన ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటవీశాఖ అనుమతి లేకుండా సిల్వర్ ఓక్, నీలగిరి, అకేషియా కలపను అనధికారికంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కార్మికుల సమస్యల పరిష్కారంపై మొండివైఖరి

- ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం తీరు సరికాదు
- ఇదే పరిస్థితి కొనసాగితే సమ్మె తప్పనిసరి
- కాఫీ కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరిక



ఏపీఎఫ్‌డీసీ డీఎం కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సంఘ ప్రతినిధులు, కార్మికులు

చింతపల్లి: కాఫీ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తే సమ్మె తప్పదని కాఫీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. బుధవారం కాఫీ డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో రెండో దఫా చర్చలు జరిపారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం సుముఖత వ్యక్తం చేయడం లేదని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్ విలేకరులతో మాట్లాడారు. ఏపీఎఫ్‌డీసీలో గత కొన్నేళ్లగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న అధికారులకు వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరినట్టు చెప్పారు. ఇదే విషయమై బుధవారం అధికారుల వద్దకు వెళ్లితే కనీస స్పందన లేకుండా పోయిందని విమర్శించారు. ప్రస్తుతం ఏపీఎఫ్‌డీసీలో సిబ్బంది కొరత ఉందన్నారు. తక్షణం నియమించకుంటే సంస్థ నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వీడకపోతే డివిజన్ల వారీగా కార్మికులను సమ్మెకు సిద్ధపరుస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కనకవల్లి, సంఘ ప్రతినిధులు మోరి గిరి, పాపారావు, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కోసం పోరాటం కొనసాగిస్తాం

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి



విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ పోరాటం కొనసాగుతుందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన తరువాత బుధవారం తొలిసారిగా విశాఖ వచ్చిన ఆయన ఎయిర్‌పోర్టులో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నియోజకవర్గ సమన్వయకర్తలు, సీనియర్ నేతలంతా కలిసికట్టుగా ఉద్యమిస్తామన్నారు. అవసరమైతే తాను ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలిపారు. దసపల్లా భూములు, ఎన్‌సీసీ భూములు, మరే ఇతర భూముల విషయంలోనైనా తాను విచారణకు సిద్ధమని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియాతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శిస్తారని తెలిపారు. ఎయిర్‌పోర్టులో విజయసాయిరెడ్డికి పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, చింతలపూడి వెంకట్రామయ్య, ముస్లిం మైనార్టీ నాయకుడు ఫరూఖీ, ముఖ్యనేతలు గొలగాని శ్రీనివాస్, ఆల్ఫా కృష్ణ, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

కాఫీ గింజలకు గిట్టుబాటు ధర

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లో సాగవుతున్న కాఫీ గింజలకు గిట్టుబాటు ధర కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. అరకు కాఫీని గిరిజన రైతులు ఆర్గానిక్ విధానంలో సాగు చేస్తున్నందున వారికి మంచి ధర కల్పించాలన్నారు. చింతపల్లి మాక్స్ సంస్థ ఈ ఏడాది 600 టన్నుల పార్చ్‌మెంట్ కాఫీగింజలను ఉత్పత్తి చేస్తుందని, బహిరంగ వేలం ద్వారా వీటిని విక్రయిస్తామన్నారు.గత రెండేళ్ల నుంచి అరకు కాఫీ ఫైన్ కప్ అవార్డు పొందుతుందన్నారు. కాఫీ నాణ్యతపై లైజన్ వర్కర్లకు అవగాహన కల్పించాలని, కాఫీ రైతులకు జియో ట్యాగింగ్ చేయాలని అధికారులకు సూచించారు. ఐటీడీఏ అధికారులు వాసుదేవమూర్తి, కిరిటిపాండే మాట్లాడుతూ చింతపల్లి మాక్స్ సంస్థ నిర్వహించే కాఫీ గింజల వేలంలో తమ సంస్థ పాల్గొంటుందన్నారు. కాఫీ గింజల విక్రయాల వేలం సమయంలో తమకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు. ఈ సమావేశంలో కేంద్ర కాఫీబోర్డు డీడీ రమేష్, ఐటీడీఏ కాఫీ ఏడీ అశోక్, ఐటీడీఏ ఏవో హేమలత పాల్గొన్నారు.



పలుశాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మరిన్ని రైళ్లు రద్దు



8లో

శిశు మరణాల నివారణకు చర్యలు

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా
- పెదబయలు పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో ప్రసూతి విభాగంలో సదుపాయాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



పీహెచ్‌సీలో మందుల నిల్వల వివరాలను తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పెదబయలు: జిల్లాలో శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులను ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీల సాయంతో ప్రసవానికి రెండు వారాల ముందుగా పీహెచ్‌సీకి తరలించి సుఖ ప్రసవాలు చేయాలని ఆదేశించామన్నారు. వీటిలో హైరిస్క్ కేసులు ఉంటే ఏరియా/ జిల్లా ఆస్పత్రిలకు రిఫర్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోడ్డు సదుపాయం లేని గ్రామాలను గుర్తించి అక్కడి గర్భిణులను కాన్పు సమయానికి ముందుగానే ఆస్పత్రికి తరలించేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతకు ముందు ఆయన పీహెచ్‌సీలో ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. వార్డులోని రోగులతో మాట్లాడారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రసూతి గదిలో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించారు. రోగులకు చేస్తున్న రక్త పరీక్షలను, ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఇన్వెర్టర్ వినియోగంలో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. రాత్రివూట ఓపీలో ఇద్దరు నర్సులు, నైట్ వాచ్‌మేన్ ఉండాలని ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫీడర్, ఇతర అంబులెన్సుల పనితీరును తెలుసుకున్నారు. అయితే కొన్ని రకాల మందుల కొరత ఉందని వైద్యాధికారి తెలిపారు. వెంటనే విశాఖపట్నం సెంట్రల్ డ్రగ్ స్టోర్ అధికారులతో మాట్లాడి సమస్య లేకుండా చూడాలని సూచించారు. పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యుల్లో తప్పనిసరిగా ఒకరు ఓపీ చూడాలని సూచించారు. గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యాధికారి నిఖిల్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధికి కృషి

కలెక్టర్ దినేష్‌కుమార్



గిరిజన సంఘాల నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: గిరిజనుల ఆకాంక్షల మేరకు అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని అన్ని గిరిజన సంఘాల నేతలతో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో విద్య, వైద్య సేవలు, రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఉద్యోగ,ఉపాధి,నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలకు అన్ని సంఘాల నేతలు తగిన సలహాలు ఇవ్వాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 కింద రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలన్నింటిని అమలుజేస్తామన్నారు.పాఠశాలల భవన నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు.ప్రభుత్వ భూములు,క్వార్టర్లను గిరిజనేతరులు అక్రమిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.మూడు,నాలుగేళ్లలో ప్రతి గ్రామానికి కనీస రహదారి సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు.

సక్రమంగా అమలు కాని మెనూ

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలుకావడం లేదని ఆదివాసీ జేఏసీ నేతలు రామారావుదొర, మొట్టడం రాజబాబు, కొర్రా బలరామ్, డాక్టర్ రామకృష్ణ, ఎస్.వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్ల పోస్టుల నిర్వహణకు ఉపాధ్యాయులు పైరవీలు చేస్తుంటారన్నారు.ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న 4,5 తరగతుల విద్యార్థులపై ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని, ఎంపీపీ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని వారు కలెక్టర్‌కు వివరించారు. కొయ్యూరు ప్రాంతంలో జీడిపిక్కల పరిశ్రమ, రంపచోడవరం ప్రాంతంలో జాఫ్రా, రబ్బరు పరిశ్రమలతో పాటు అటవీ ఉత్పత్తుల యూనిట్లను కూడా ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. గంజాయి సాగు,రవాణా,వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యసేవలతో పాటు రక్తపరీక్షలు సక్రమంగా జరగడం లేదన్నారు.నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలపై చర్యలు తీసుకోవాలన్నారు. రెడ్ క్రాస్ కార్యకలాపాలు సక్రమంగా లేకపోవడంతో రక్తం కొరత ఏర్పడుతుందన్నారు.మారేడుమిల్లి నుంచి రాజమండ్రికి బస్ సౌకర్యం కల్పించాలని వారు కలెక్టర్‌ను కోరారు.చింతూరు డివిజన్‌లో వరద సహాయక కార్యక్రమాలతో పాటు, నష్టాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్న కలెక్టర్ దినేష్‌కుమార్‌ను గిరిజన సంఘాల నేతలు అభినందించారు. పలు గిరిజన, విద్యార్థి సంఘాల నేతలు కె.ఆనందరావు, గోపాల్, అశోక్,డాక్టర్ పి.కుమార్,సన్యాసిరెడ్డి,కిరసాన కిషోర్,ఎం.బాబుజీ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి


దుకాణాల ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: మండలంలో బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తహసీల్దార్ సూర్యారావు అన్నారు. రాజవొమ్మంగి, జడ్డంగి గ్రామాల్లో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు వ్యాపారుల ఆయన నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. బుధవారం దుకాణాలు ఏర్పాటుకు అనువైన స్థలాలను ఆయన పరిశీలించారు. రాజవొమ్మంగి కన్నయమ్మపేట వద్ద ఆర్అండ్‌బీకు చెందిన 48, 59 సర్వే నంబర్లలోని స్థలాలను కేటాయించామన్నారు. దుకాణాల ఏర్పాటుకు ఇప్పటివరకు రాజవొమ్మంగి నుంచి ముగ్గురు, జడ్డంగి పంచాయతీ నుంచి ఇరువురు వ్యాపారులు ముందుకు వచ్చారని తహసీల్దార్ పేర్కొన్నారు. దుకాణాలు ఏర్పాటు చేయదలిచేవారు ఫైర్‌స్టేషన్, పోలీస్‌స్టేషన్, పంచాయతీల నుంచి అనుమతి పత్రాన్ని తీసుకొని దరఖాస్తుతో జత చేయాలని సూచించారు. దుకాణాల ఏర్పాటుకు 25వ తేదీ లోగా సూచించిన ధరావత్తు సొమ్మును ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. అగ్నిప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్తగా బాణసంచా దుకాణాల వద్ద ఇసుక, నీరు తదితర సామగ్రి ఉంచాలని సూచించారు. డీటీ ఎస్‌కే కరీముల్లా, ఆర్ఐ చెల్లమ్మ, వీఆర్వోలు సూర్యాకాంతం, దాక్షాయని తదితరులున్నారు.

వరి సంరక్షణకు సూచనలు


అంజోడలో రైతులతో వ్యవసాయాధికారులు


రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త ప్రదీప్‌కుమార్ తదితరులు


పెదబరడలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు

కొయ్యూరు: మండలంలోని శరభన్నపాలెం, వెలగలపాలెంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన శాస్త్రవేత్త ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పడిపోయిన వరి కట్టలను కట్టి నిలబెట్టాలని, నీరులేకుండా చూడాలని సూచించారు. ఆర్ఎస్ఆర్ రకం కోతకు సిద్ధంగా ఉందని, పురుగుమందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ వరిలో తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. ఏవో ఉమాదేవి మాట్లాడుతూ వచ్చే నెల 15 నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఏఈవో సత్యనారాయణ, వీఏఏ,వీహెచ్ఏ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో మంచి దిగుబడులు

చింతపల్లి: వరి పంటలో సస్యరక్షణ చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు సాధించ వచ్చని వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. పెదబరడ పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి పంటలో చేపట్టే పలు సస్యరక్షణ కార్యక్రమాలను వివరించారు. పెదబరడ సర్పంచ్ గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, గెమ్మిలి అబ్బాయినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ చిన్న అంజోడలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి నీలవేణి మాట్లాడుతూ గిరి రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వల్ల పంటకు తీరని నష్టం కలుగుతుందన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను వినియోగం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయడానికి కృషి చేయాలని, ఆర్గానిక్ సర్టిఫికెట్ కోసం రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. కొర్రాయి సర్పంచ్ కొములు, హార్టీకల్చర్ అసిస్టెంట్ పి.సాయిత, ఏపీ పీఎస్ఎఫ్ ఇన్‌చార్జ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


జె.కూర్మారావు, ఎక్సైజ్ సీఐ

చింతపల్లి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ జె.కూర్మారావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. మద్యం విక్రయాలకు ప్రభుత్వం లైసెన్స్‌లు మంజూరు చేసిందని, చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఆరు మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతులను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. బెల్టుషాపులు నిర్వహించినా, మద్యం అక్రమ అమ్మకాలు జరిపినా, అధిక ధరలకు విక్రయించినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి: చింతపల్లి, జీకే వీధి మండలాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల పరిధిలో జంగిల్ క్లియరెన్సు చేయడంలో భాగంగా విద్యుత్ సరఫరాకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలవరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అప్పలరాజుపేటలో ఒకరికి మలేరియా

- గ్రామంలో ఫీవర్ సర్వే


అప్పలరాజుపేటలో సర్వే చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో మంగళ, బుధవారాల్లో ఫీవర్ సర్వే (జ్వర పీడితుల ఆరా) జరిగింది. ఈ గ్రామంలో రెండు రోజుల క్రితం ఒకరికి మలేరియా పాజిటివ్ నమోదైన విషయం తెలిసిందే. ఈ మేరకు మలేరియా, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇంటింటికి వెళ్లి ఎవరికైనా జ్వర బాధితుల వివరాలు సేకరించారు. ఇటీవల ఇతర మండలాలు, జిల్లాల నుంచి ఎవరైనా గ్రామంలోకి వచ్చారా అని ఆరా తీశారు. గ్రామస్తుల రక్త పూతలు సేకరించి మలేరియా టెస్టులు చేశారు. కాగా ఎవరికి పాజిటివ్ నమోదు కాలేదని ఎంటీఎస్ సోమరాజు, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మయ్య తెలిపారు. ప్రతి ఒక్కరు దోమతెరలు ఉపయోగించాలని సూచించారు. హెచ్‌వీ లక్ష్మమ్మ, ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చకామెర్లతో గిరిజనుడి మృతి


కొండబాబు (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ తాలలుతోట గ్రామానికి చెందిన కె.కొండబాబు(32) అనే గిరిజనుడు పచ్చకామర్లతో బాధపడుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కొండబాబును కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తీసుకొని వచ్చారు. వైద్యులు వైద్య సేవలు అందించారు.పరీక్షలు నిర్వహించగా పచ్చకామెర్లుగా నిర్ధారించారు. అయితే కొండబాబు పరిస్థితి విషమంగా ఉన్నట్టు గుర్తించి, మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య గౌరి గర్భిణి కాగా, ఒక పాప కూడా ఉంది. కొండబాబు మృతితో తాలబుతోటలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

ఒకే ప్రాంతంలో మూడు మద్యం దుకాణాలు

- నిత్యం రద్దీగా ఉండే చోట ఏర్పాటుపై విమర్శలు
- ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశాలు
- ఉన్నతాధికారులు స్పందించాలని పట్టణ ప్రజల వినతి


పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ఎదురెదురుగా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలు

సాక్షి,పాడేరు: నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఎదురెదురుగా మూడు మద్యం దుకాణాల ఏర్పాటు విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రమైన పాడేరులో పాతబస్టాండ్ నుంచి సినిమాహాల్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో వర్మ హోటల్ జంక్షన్ వద్ద మూడు మద్యం దుకాణాలు ఎదురెదురుగా ఏర్పాటుచేశారు. పాడేరు పట్టణంలో నాలుగు మద్యం దుకాణాలు మంజూరు కాగా వీటిలో మూడు ఒకేచోట ప్రారంభించడం వల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఒక్కటీ ఈ ప్రాంతంలో ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం ఏకంగా మూడు మద్యం దుకాణాలను ఒకేచోట ఏర్పాటుకు అనుమతించడం దారుణమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం ప్రియుల వాహనాలు దుకాణాల ఎదుట పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే మార్గంలో జిల్లా ఉన్నతాధికారులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో, డీఎఫ్‌వోతో పాటు పలు ఉన్నతాధికారుల వాహనాలు వెళ్తుంటాయి. ఈ వాహనాలు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకునే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా కలెక్టర్, ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారుల స్పందించి ఒకే ప్రాంతంలో మూడు మద్యం దుకాణాలు లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పీరియాడికల్ థ్రిల్లర్ 'క'


మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం

డాబాగార్డెన్స్(విశాఖ): పీరియాడికల్ థ్రిల్లర్‌గా రూపొందిన 'క'చిత్రం ఈ నెల 31 విడుదలవుతోందని, ప్రేక్షకులు ఈ సినిమాను విజయవంతం చేయాలని హీరో కిరణ్ అబ్బవరం కోరారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను తొలిసారిగా పాన్ ఇండియాలో నటించానని, సుజీత్, సందీప్ రచన, దర్శకత్వంలో సినిమా బాగా వచ్చిందన్నారు. సామ్ సీఎస్ వీనుల విందుగా సంగీతం అందించారని, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అదిరిపోతుందన్నారు. హీరోయిన్లుగా నటించిన నయన సారిక, తన్వీరామ్‌కు ప్రాధాన్యం ఉంటుందన్నారు. గురువారం చిత్ర ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. తనకు ఎంతో సెంటిమెంట్ అని కిరణ్ చెప్పారు.

పోలీసుల శ్రమదానం


పోలీసు స్టేషన్ ఆవరణలో శ్రమదానం కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ భూషణం

గంగవరం: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తచెదారాలను పోలీసు సిబ్బంది, స్థానిక యువత శ్రమదానంతో తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భూషణం మాట్లాడుతూ స్టేషన్ ప్రాంగణంలో పచ్చదనం , పరిశుభ్రత కోసం ఈ శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. పోలీసు స్టేషన్, సిబ్బంది క్వార్టర్స్‌లో పిచ్చి మొక్కలను తొలగించి నీడ నిచ్చే మొక్కలను నాటనున్నట్టు ఆయన తెలిపారు. ఏఎస్ఐ రజాక్, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఎంవీపీ కాలనీ(విశాఖ): డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు తెలిపారు. డీఎస్సీకి సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ ఉచిత శిక్షణ అందిస్తున్న విషయం తెలిసిందే. గతంలో ప్రకటించిన దరఖాస్తు గడువు 21వ తేదీతో ముగియడంతో ఈ నెల 25 వరకు మరోసారి పొడిగించారు. దరఖాస్తు గడువు ముగిసిన అనంతరం అభ్యర్థుల ఎంపికకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు రామారావు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఒకేరోజు ఈ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు వారి ఆసక్తికి అనుగుణంగా వివిధ జిల్లాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. విశాఖ జిల్లాలో 100 మంది వరకు శిక్షణ కోసం ఎంపిక చేస్తామన్నారు.

మానసిక ఆందోళనతో వివాహిత ఆత్మహత్య


మేధానాగ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

సీతమ్మధార(విశాఖ): మానసిక ఆందోళనతో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సీతమ్మధార ప్రాంతంలో నివాసముంటున్న ఎం.మేధానాగ్(33), ఎం.శ్రీకాంత్‌రెడ్డితో 2020, మార్చి 19వ తేదీన వివాహం జరిగింది. మూడేళ్ల పాటు వారు సంతోషంగా ఉన్నారు. శ్రీకాంత్‌రెడ్డి ఉద్యోగరీత్యా 2023లో అమెరికాకు వెళ్లాడు. భార్య మేధానాగ్‌కు వీసా వచ్చాక తీసుకువెళ్లాలని భావించాడు. అయితే వీసాకు సమయం పట్టడంతో మేధానాగ్ మానసిక వేదనకు గురైంది. దీంతో బుధవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తండ్రి ఎం.నగేష్ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను మృతురాలి తండ్రితో మాట్లాడారు. ఆమెకు, ఆమె భర్తకు ఎటువంటి విబేధాలు లేవని, ఇద్దరూ సంతోషంగానే ఉన్నారని అతడు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు

నర్సీపట్నం: సైబర్ నేరగాళ్లు మహిళను మోసగించి రూ.3.79 లక్షల నగదును కాజేసిన ఘటన నర్సీపట్నం మండలం నీలంపేటలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై రాజారావు అందించిన వివరాలు.. మాకిరెడ్డి కల్పన ఉద్యోగాల కోసం షేర్ చాట్‌లో అన్వేషిస్తుండగా వేరే యాప్‌కు కనెక్ట్ అయింది. సైబర్ నేరగాళ్లు ముందుగా ఆమె అకౌంట్‌కు రూ.1300 బోనస్ కింద జమ చేశారు. తరువాత మరో రూ.200 జమ చేశారు. దఫదఫాలుగా డబ్బులు రావాలంటే రూ.80 వేలు పంపించాలని చాటింగ్‌లో సైబర్ నేరగాళ్లు సూచించారు. యాప్‌లో ఆమె రూ.80 వేలు జమ చేసింది. 'నీ అకౌంట్ బ్లాక్ అయింది. మరికొంత అమౌంట్ పంపించాల'ని సైబర్ నేరగాళ్లు చాట్ చేశారు.

బంగారం తాకట్టుపెట్టి, అప్పు చేసి రూ.3.79 లక్షల వరకు ఆన్‌లైన్ ద్వారా వివిధ అకౌంట్లకు జమ చేసింది. అటు నుంచి సమాధానం లేకపోవడంతో మోసపోయానని తెలుసుకొని యువతి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీటీల పేరుతో రూ.20 కోట్లకు టోకరా

భార్యాభర్తలపై చీటింగ్ కేసు నమోదు

తగరపువలస(విశాఖ): తగరపువలసకు చెందిన భార్యాభర్తలు వంగపండు రోజా, శ్రీనివాసరావులపై భీమిలి సీఐ బి.సుధాకర్ బుధవారం చీటింగ్ నమోదు చేశారు. భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ చంద్రరావు వీధికి చెందిన కొసన సత్యవతి ఈ మేరకు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల కిందట రోజా, శ్రీనివాసరావులు చిప్పాడ వెళ్లి తాము చీటీలు, లక్కీ డ్రాలు స్కీమ్‌లు, వరలక్ష్మి స్కీమ్‌లు వేస్తున్నామని.. వీటి ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరుస్తామని గ్రామస్తుల నుంచి డబ్బులు వసూలు చేశారు. డబ్బులు కట్టిన వారికి ఇప్పటి వరకు డబ్బులు, వడ్డీలు తిరిగి చెల్లించలేదు. పంచాయతీ వాసులను నమ్మించి సుమారు రూ.1.35 కోట్ల వరకు వసూలు చేసినట్టు బాధితురాలు ఫిర్యాదు చేశారు. కాగా ఈ విషయం తెలుసుకున్న భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతానికి చెందిన వందల మంది బాధితులు బుధవారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. రోజా, శ్రీనివాసరావు చేతిలో మోసపోయామని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పప్పుల చీటీలు, లక్కీ స్కీమ్‌ల పేరుతో ఈ దంపతులు వసూలు చేసి తిరిగి చెల్లించని సొమ్ము రూ.20 కోట్లు పైబడి ఉంటుందని అంచనా. దీనిపై పోలీసులు గురువారం పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

మరిన్ని రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ): దానా తుఫాను కారణంగా వాల్తేర్ డివిజన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

24న రద్దయిన రైళ్లు

ఎస్ఎంవీటీ బెంగళూరు-హౌరా (22888)హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-చత్రపతి శివాజి టెర్మినస్ ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-హౌరా(18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్

25న రద్దయిన రైళ్లు

ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12839) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గుణుపూర్-కటక్(08422) మెము, భువనేశ్వర్-విశాఖపట్నం(20841) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-సికింద్రాబాద్(17015) విశాఖ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్- కేఎస్ఆర్ బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-రామేశ్వరం(20896) ఎక్స్‌ప్రెస్, పూరీ-యశ్వంత్‌పూర్ (22883)గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్

26న రద్దయిన రైళ్లు

పూరీ-గాంధీధాం(22974) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సిల్చార్(12513) ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-పూరీ(22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, మంగళూరు సెంట్రల్-సంత్రగచ్చి(22852)వివేక్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు-కామాఖ్య (12551) ఏసీ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-పూరీ(17480) ఎక్స్‌ప్రెస్

27న రద్దయిన రైళ్లు

రామేశ్వరం-భువనేశ్వర్(20895) ఎక్స్‌ప్రెస్, వాస్కోడిగామా-షాలిమర్(18048)అమరావతి ఎక్స్‌ప్రెస్, గౌహతి-ఎస్ఎంవీటి బెంగళూరు(12510) ఎక్స్‌ప్రెస్ - 29న మాల్దా టౌన్-సికింద్రాబాద్(03430) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దయింది.

30 సెకన్లు.. 184 పంచ్‌లు

- బాక్సింగ్‌లో కనకారావు అరుదైన రికార్డ్
- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



మధురవాడ(విశాఖ): పీఎంపాలెం డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకుడు పెదిరెడ్ల కనకారావు అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ విభాగంలో 30 సెకన్లలో బాక్సింగ్ గ్లౌజులు 184 పంచ్‌లు విసిరి ప్రపంచ రికార్డును సృష్టించారు. దీంతో అతనికి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఆగస్టులో నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో కనకారావు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులకు పంపించారు. ఈ ఫీట్‌ను రికార్డ్‌గా గుర్తించి నిర్వాహకులు కనకారావును అభినందించి తమ బుక్‌లో పేరు నమోదు చేశారు. ఈ రికార్డ్స్‌కు సంబంధించి సర్టిఫికెట్, మెడల్, ట్రోఫీని బుధవారం ఆయన అందుకున్నారు. మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన బాక్సర్లు ఆయన్ని అభినందించారు.

3 నుంచి 'పంచారామ దర్శిని'

డాబాగార్డెన్స్ (విశాఖ): పవిత్ర కార్తీకమాసంలో ఒకే రోజున పంచారామాలను దర్శనం చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నవంబర్ 3, 10, 17, 24వ తేదీల్లో వచ్చే ఆదివారాల్లో ప్రత్యేక బస్సులు నడపనుంది. అమరేశ్వరస్వామి(అమరావతి), సోమేశ్వరస్వామి(భీమవరం), క్షీర రామలింగేశ్వరస్వామి(పాలకొల్లు), భీమేశ్వరస్వామి(ద్రాక్షారామం), కుమార రామలింగేశ్వరస్వామి(సామర్లకోట)ని ఒకే రోజు దర్శనాలు చేసుకునేందుకు వీలుగా ఈ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో సాయంత్రం 5 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ ప్రయాణ చార్జీ రూ.2,150, అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.2,100, ఇంద్ర ప్రయాణ చార్జీ రూ.2,600గా నిర్ణయించారు.

లంబసింగి టూర్..

కార్తీక మాసం పురస్కరించుకుని పిక్నిక్‌లకు లంబసింగి వెళ్లే పర్యాటకులలకు శని, ఆది వారాల్లో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయి. లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్‌ఫాల్స్, మోదమాంబ గుడి, కాఫీ ప్లాంటేషన్ చూపిస్తారు. ఒక్కొక్కరికి అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.800, ఎక్స్‌ప్రెస్ ప్రయాణ చార్జీ రూ.650.

ధారమట్టం టూర్

ఈ బస్సులు శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి బయలుదేరుతాయి. శివాలయం, ధారమట్టం వాటర్‌ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జనకొండ(అనకాపల్లి) చూపిస్తారు. ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ ప్రయాణ చార్జీ రూ.650, అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.550.

విజ్ఞాన విహార యాత్రలకు..


కార్తీక మాసంలో విజ్ఞాన విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇవ్వనున్నట్టు అప్పలనాయుడు తెలిపారు. ప్రయాణికులు గ్రూపుగా సంప్రదిస్తే వారు కోరిన రోజున టూర్ స్పెషల్స్ నడుపుతామన్నారు.

సంప్రదించండి ఇలా..

పంచారామ దర్శిని, పిక్నిక్‌లు, మార్గశిర మాసంలో పంచవైష్ణవి క్షేత్ర దర్శనాల కోసం వెళ్లే భక్తులు www.apsrtconline.in ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని అప్పలనాయుడు తెలిపారు. ద్వారకాబస్టేషన్ వద్ద గల రిజర్వేషన్ కౌంటర్లలో కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 99592 25602, 90522 27083, 99592 25594, 91001 09731లో సంప్రదించవచ్చు.

అక్కతో ప్రేమ వివాహం..చెల్లెలిపై అత్యాచారం

- పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్
- విలేకరుల సమావేశంలో కేసు వివరాలు
- వెల్లడించిన డీఎస్పీ సత్యనారాయణ


మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

యలమంచిలి రూరల్ : పట్టణంలో 16 ఏళ్ల బాలికపై లైంగిక దాడి కేసుకు సంబంధించి పోలీసుల దర్యాప్తులో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. నిందితుడు బంగారు వెంకీ(20) బాధితురాలి అక్కను ప్రేమించి పెళ్లి చేసుకుని ఏడాదిన్నర కాకముందే భార్య చెల్లెలిపై కన్నేసి ఆమెపై ఘాతుకానికి ఒడిగట్టాడు. కామంతో కళ్లు మూసుకుపోయిన నిందితుడు చేసిన అఘాయిత్యంతో ఒకే కుటుంబానికి చెందిన బాధితురాలితో పాటు ఆమె అక్క భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు అధికారి పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ బుధవారం విలేకరులకు వివరాలు తెలిపారు. యలమంచిలి పట్టణం సీపీ పేటకు చెందిన బంగారు వెంకీ బాధితురాలి అక్కను ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. గర్భం దాల్చిన వెంకీ భార్య మే నెలలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత బాలింత అయిన అక్కకు సహాయం చేయడానికి ఆమె చెల్లెల్ని (బాధితురాలు) పుట్టింటి నుంచి తన వద్దకు తెచ్చుకుంది. చెల్లెలిపై కన్నేసిన నిందితుడు వెంకీ ఆ ఇంట్లోనే గత మే నెలలో ఆమెకు మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆమెను బెదిరించి సెప్టెంబరు వరకు పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరితోనైనా చెబితే చంపుతానని, మీ అక్క భవిష్యత్తు పాడవుతుందని నిందితుడు బాధితురాలిని బెదిరించాడు. దీంతో అక్కకు హాని జరుగుతుందన్న బెంగతో ఇన్నాళ్లూ ఈ విషయాన్ని తనలో ఉంచుకుని బాధపడుతున్న బాధితురాలు కొన్ని రోజులుగా ముభావంగా ఉండడం, స్కూల్‌కు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చి ఆరా తీయగా తనకు జరిగిన దారుణాన్ని వెల్లడించింది. దీంతో నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు తన తల్లిదండ్రుల సహాయంతో మంగళవారం రాత్రి యలమంచిలి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్లు 64(2)(ఎఫ్) (ఎమ్), 65,(1), 351(3) పోక్సో చట్టం-2015 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించిన పరవాడ డీఎస్పీ సత్యనారాయణ నిందితుడు నేరాన్ని అంగీకరించాడన్నారు. నిందితుడ్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు అతని ఇంటి వద్ద మధ్యవర్తుల సమక్షంలో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. చిన్న పిల్లలు, టీనేజీలో ఉన్న మైనర్ల కదలికలపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించడంతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వాళ్లకు అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి దారుణాల వల్ల రెండు కుటుంబాల మధ్య మానవ సంబంధాలు దెబ్బతింటాయన్నారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపర్చనున్నట్టు డీఎస్పీ తెలిపారు.

తుపానుపై వాల్తేర్ డివిజన్ అప్రమత్తం

తాటిచెట్లపాలెం(విశాఖ): దానా తుపాను ప్రభావంతో కురిసే భారీ వర్షాలను, తద్వారా వచ్చే పరిణామాల్ని ఎదుర్కొనేందుకు వాల్తేర్ డివిజన్ ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. డివిజన్ డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ ఈ పరిస్థితులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు రైళ్ల రద్దు, దారి మళ్లింపు సమాచారం వివిధ మాధ్యమాల్లో చేరవేస్తున్నారు. వాతావరణ విభాగం నుంచి వచ్చే సమాచారం మేరకు చర్యలు తీసుకునేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాల్ని, సిబ్బందిని నియమించారు. అదనపు కంట్రోల్ రూంలు, హెల్ప్‌డెస్క్‌లు, రిజర్వేషన్ రద్దు, వాపసు కోసం అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశారు.

హెల్ప్‌లైన్ నెంబర్లు:
విశాఖపట్నం-0891-2746330/ 2744619, 87126 41255, 77807 87054
విజయనగరం-08922-221202, 87126 41260
శ్రీకాకుళం రోడ్-08942-286213, 286245
దువ్వాడ-8500358524
రాయగడ-06856-223400, 94397 41071

అనకాపల్లి ఎక్సైజ్ ఏసీగా సుర్జిత్ సింగ్

సాక్షి, అనకాపల్లి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎస్.సుర్జిత్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.